దాడి?

బి. రాజేశ్వరి

"మా యింట్లో మన పెళ్ళికి ఒప్పుకోవటంలేదు" తల వంచుకుని మెల్లగా చెప్పింది శ్రీదేవి.

వాసు ఆమెవైపు సూటిగా చూశాడు.

"ఇది మనం ముందుగా వూహించినదే. అది మన వివాహాన్ని ఆపదు. నేను చెప్పింది సరైన మార్గం!"

శ్రీదేవి కళ్ళెత్తి అతనివంక చూసింది. అదేమిటో ఆమెకు తెలుసు. అంతక్రితం యెన్నోసార్లు అతను చెప్పాడు, చెప్తున్నాడు. కాని ఆమె స్త్రీ. మగాడిలా, సంఘాన్ని లెక్క చెయ్యకుండా కట్టుబాట్లను తెంచుకోవటం ఆమె వూహలోకి కూడా రాని విషయం.

"ఇద్దరం ఉద్యోగాలు చేసుకొంటున్నాం. ఒకరి నొకరు బాగా అర్థం చేసుకున్నాం. దాదాపు అయిదేళ్ళుగా యిదే ఆఫీసులో పని చేస్తున్నాం. మనమధ్య అరమరికలు గాని, రహస్యాలు గాని లేవు. కేవలం మూర్ఖత్వంలో పెద్దవాళ్ళు కాదన్నంత మాత్రాన పెళ్ళి

మా నేస్తామా?" అన్నాడు వాసు.

"నా తర్వాతివాళ్ళు యిద్దరు ఆడపిల్లలే కావటం నా దురదృష్టం. వాళ్ళ పెళ్ళిళ్ళు నా మూలంగా కాకుండా పోతాయని మరి వాళ్ళ భయం. కులాంతర వివాహాల గురించి అందరూ లెక్చర్లు దంచేవాళ్ళేగాని, ఆచరణ కొచ్చేసరికి అందరికీ చిన్న చూపే! మన సమాజం ఇంకా పాత సంప్రదాయాల్ని, కట్టుబాట్లని పట్టుకొని వేలాడుతూనే వుంది. అది మరిచిపోతున్నావ్ వాసు."

"దేవీ! డొంకతిరుగుడు వ్యవహారమంటే నాకు నచ్చదని నీకు తెలుసు. నేను స్ట్రెయిట్ ఫార్వర్డు! మీ నాన్నగారు నీ వివాహానికి యెందుకు వ్యతిరేకిస్తున్నాడో నీ కీ పాటికి అర్థమయి వుంటుంది. నీ చెల్లెళ్ళకి పెళ్ళిళ్ళు కాకుండా పోతాయని ఆయన భయపడుతున్న మాట నేనొప్పుకుంటున్నాను. కాని అది పరువు భయంకాదు, ఆర్థిక భయం!"

శ్రీదేవి వెంటనే మాట్లాడలేకపోయింది. ఏం మాట్లాడుతుంది? అతను చెప్పినదాంట్లో అతిశయోక్తి యేమాత్రం లేదు! తనని అతనితో పెళ్ళికి అభ్యంతరపరుస్తూన్న కారణం—డబ్బు!

ఇన్నాళ్ళుగా తన జీతం ఇంటి ఖర్చులకి యాథేచ్ఛగా వాడేస్తున్న తండ్రికి యిది కోలుకోలేని దెబ్బ! ఒక్కసారిగా తమ యింటి ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్థమవుతుంది.

అటు తండ్రిని నొప్పించలేదు. ఇటు మనసిచ్చిన వాసుని ఒదులుకోలేదు. ఆమె మనసులో అసంఖ్యాకమైన ప్రశ్నలు! తనిప్పుడేం చెయ్యాలి?

తెగించి పెళ్ళి చేసుకొంటే తనవాళ్ళందరికీ దూరమై

పోవటమే కాక, వాళ్ళకి ద్రోహం చేసినట్టవుతుందేమో!? స్వార్థపరురాలని నలుగురూ చూపిస్తారు. అలా అని ప్రాణసమంగా ప్రేమించిన వాసుని వదులుకోవటమా!?!

ఊహూ! ఎప్పటికీ ఒదులుకో లేదు. తను తప్పుగా ప్రవర్తించటం లేదు—తండ్రికి చెప్పకుండా రహస్యంగా చేసుకోవాలనుకో లేదు. ఏం దాచకుండా తండ్రికి చెప్పి ఆయన అనుమతి కోరింది. కాని ఆయనే తన పెద్దరికాన్ని నిలుపుకో లేదు. పెద్ద మనసుతో ఆలోచించ లేదు. అందుకే....అందుకే....తను ఓ అడుగు ముందుకు వెయ్యవలసి వస్తోంది.

వాసు అసహనంగా చూశాడామె వంక.

శ్రీదేవి అతనివంక నవ్వుతూ చూసింది.

వాసు ముఖం విప్పారింది. చనువుగా ఆమె చేతినందుకుని చిన్నగా నొక్కాడు.

“మరొక్కసారి — యిదే చివరిసారి — ప్రయత్నిస్తాను. అప్పుడు కూడా నాన్న ఒప్పుకోకపోతే నువ్వెలా చెపితే అలా చెయ్యటానికి సిద్ధం!” అంది.

2

ఇంటికి చేరుతూనే వరండాలో యేదో పరిచితమైన గొంతు వినిపించి నడక వేగం తగ్గించింది శ్రీదేవి. ఆ గొంతు వెనువెంటనే ఆమె గుర్తించింది.

సంజీవి బావ! మేనత్తకొడుకు!

అకస్మాత్తుగా మద్రాసునించి యిక్కడికెందుకు పరుగెత్తుకొచ్చాడు?

“రా, రా! ఇదేనా ఆఫీసునించి రావటం?” శ్రీదేవిని

చూస్తూనే చేటంత మొహం చేసుకొని అడిగాడు సంజీవి.

సంజీవి అధునాతనంగా డ్రెస్ చేసుకొని, హుందాగా గొప్పగా కనిపించాలని వ్యర్థప్రయత్నం చేస్తున్నాడు. కేవలం అయిదడుగుల మూడంగుళాల పొడవుండే సంజీవి ఆ దుస్తుల్లో ఓ వింతవ్యాగంలా కనిపించాడామెకు. పొట్టిగా వుండటమే కాక చామనఛాయ కన్న ఛాయ తక్కువగా, ముందుకి తోసుకొచ్చిన పళ్ళతో కొంత వికృతంగా కనిపిస్తాడు.

సంజీవి ఆమెకేసి నవ్వుతూ చూశాడు. కాని శ్రీదేవి గమనించనట్టే లోపలికి వెళ్ళిపోయింది.

ఓ గంట తర్వాత పుల్లారావు కుమార్తెను వెతుక్కుంటూ వంటగదిలోకి వచ్చాడు. కూతుళ్ళు ముగ్గురు రాత్రి భోజనానికి వంట ఏర్పాట్లలో వున్నారు.

పుల్లారావు శ్రీదేవిని సమీపించి మెల్లగా చెప్పాడు: "ఓసారి బయటకు రా అమ్మా! నీతో మాట్లాడాలి!"

శ్రీదేవి తండ్రికేసి ఓసారి చూసి, "నాకు తెలుసు నాన్నా. మీ రెందుకు పిలుస్తున్నారో! నా నిర్ణయంలో మార్పురాదు. నేను బావని ఎన్నటికీ చేసుకోను. నా నిర్ణయం మీకు చెప్పాను. మీ ఆశీస్సులు కోరుతున్నాను. మీరు నా మనసు గ్రహించి వాసుతో నా పెళ్ళి జరిపించండి!" అన్నది.

పుల్లారావు ముఖం అప్రసన్నంగా మారిపోయింది. "అయితే నీ అభిప్రాయం మార్చుకోనన్న మాట!? బావలో ఏం లోపం చూశావు? లక్షాధికారి. ఏకైక వారసుడు. నా చెల్లెలి కొడుకు. మనం రమ్మంటే తనిల్లు వాకిలి వదిలేసి వచ్చి ఇల్లరిక ముంటాడు. అంతకన్న

కావలసిందేముంది?" అన్నాడు.

"ఇల్లరికం వచ్చే అల్లుడు ఆత్మాభిమానం, పౌరుషం వదులుకొంటాడు. నా భర్తగా అలాంటివాడ్ని ఊహించ లేను. సారీ...."

"ఊరు పేరు లేనివాడ్ని, మన కులంగానివాడ్ని నువ్వు చేసుకుపోతే నీ తర్వాతి యిద్దరు ఏమయిపోతారో ఆలోచించావా?"

"ఏమీకాదు. హాయిగా తమకు నచ్చిన వాళ్లను వివాహం చేసుకొంటారు. నాన్నా! కాస్త విశాలంగా ఆలోచించండి. మీ అనుమతితో చేసుకుంటే నాకెంతో సంతృప్తిగా, ఆనందంగా వుంటుంది!"

పుల్లారావు ఆమె మాటలు పూర్తిగా వినకుండానే విసురుగా బయటకు వెళ్లిపోయాడు.

శ్రీదేవి దీర్ఘంగా నిట్టూర్చింది. తండ్రి తన పట్టు వదలడు. తను వాసుని వదలదు. ఆఖరుసారిగా చేద్దామన్న ప్రయత్నం సంజీవి రాకతో మరింత జటిలమైపోయింది.

ఆ రాత్రి పుల్లారావు యింట్లో భోంచెయ్యకుండా కోపించాడు. చిన్నకూతుళ్లిద్దరు బతిమాలినా భోజనానికి రాలేదు. సంజీవి బలవంతంచేసి ఆయన్ని డైనింగ్ టేబిల్ దగ్గరకు రప్పించాడు.

తల్లి బతికి వుంటే తన మనసు గ్రహించి ఆ ప్రకారం తండ్రిని ఒప్పించి వుండేదనిపించింది శ్రీదేవికి. చాలా సేపు తల్లి ఫోటో దగ్గర నిల్చుని కన్నీరు పెట్టుకుంది.

ఆ రాత్రి ఆమె భోంచెయ్యలేదు.

పుల్లారావు భోంచెయ్యమని అడగలేదు.

ఆ మర్నాడే వాసుకు తన సమ్మతిని తెలియజేసింది

శ్రీదేవి.

స్నేహితులు, ఆఫీసు కొలీగ్స్ సమక్షంలో వాసు, శ్రీదేవి భార్యాభర్తలయ్యారు రిజిస్ట్రారాఫీసులో!

వాసు బంధువులందరు వివాహానికి హాజరయ్యారు. శ్రీదేవి తరఫున బంధువులెవరూ రాలేదు. శ్రీదేవి చెల్లెళ్ళు తండ్రికి తెలియకుండా పెళ్ళికి వెళ్ళాలనుకొన్నారు గాని, పుల్లారావు గడప దాటనివ్వలేదు. తను ఆఫీస్‌కి వెళ్ళటం మానేసి ఇంట్లోనే వుండిపోయాడా రోజంతా.

శ్రీదేవి లోలోపల చాలా బాధపడింది. కాని, తండ్రి మూర్ఖత్వానికి తన జీవితాన్ని బలి చేసుకోకూడదని ముందే నిర్ణయించుకొన్నది. తన సంపాదన మీద బతికా లనుకొంటున్న తండ్రిపట్ల ఆమె మనసులో ఉదాసీనత చోటు చేసుకొంది.

పెళ్ళయ్యాక కూడా తన జీతంలో సగం తండ్రి కివ్వటానికి వాసుని ఒప్పించింది మొదట్లోనే.

వాసుకి ఆమె జీతంపైన ఆసక్తిలేదు, ఆమెమీద తప్ప. ఆమె తనదైతే చాలునని, ఆమె సంపాదనను తన యిష్టమొచ్చినట్టు ఖర్చు పెట్టుకోవచ్చునని మొదటే చెప్పాడు. సగం తండ్రికిచ్చి తక్కిన సగం ఆమె పేర నే సేవింగ్స్ ఖాతాలో వేసుకొమ్మని సూచించాడు. అంత విశాల హృదయంతో అతను మాట్లాడుతుంటే అతనిమీది గౌరవం మరింతగా పెరిగిందామెకు.

వాసుని చేసుకుతీరాలనే నిర్ణయాన్ని అతని సత్ప్రవర్తన, నిరాడంబరత, విశాల హృదయం—మరింత బలపరిచాయి. ఆమెను అతనిపట్ల బలంగా ఆకర్షించుకున్నాయి. అందుకే మొదట కాదన్నా ఆమె అతన్నే వివాహం చేసుకోవటానికి మనస్ఫూర్తిగా అంగీక

రించింది.

పెళ్ళయిన వెంటనే తండ్రిని చూడాలనిపించినా ఆ కోరికను బలవంతాన నిగ్రహించుకొన్నది. తనమీద శ్రాద్ధా వేశాలను వెళ్ళగక్కి, బయటకు పొమ్మని గొడవ చేస్తే ...!? ఆ అవమానాన్ని తనసలే భరించలేదు.

"ఓ వారం రోజులపాటు యీ మనుషులకి మన సమస్యలకి దూరంగా యెక్కడికైనా పోయి గడిపివద్దాం!" అంది శ్రీదేవి.

వాసు చిన్నగా ఆమె చెయ్యి నొక్కి, "యు మీన్ హనీమూన్!?" అన్నాడు.

సిగ్గుగా తలూపింది శ్రీదేవి.

"సరే. వెళ్దాం."

"ఎక్కడికి?"

"అది కూడా నువ్వే చెప్పు!"

శ్రీదేవి ఓ నిమిషం ఆలోచించి, "పర్ణశాల!...."

వాసు ఆమెవంక ఆశ్చర్యంగా చూసి "పర్ణశాలకా? ఇంకా ఏ అరకు వేలీకో, బెంగుళూర్ కో, హార్స్లీ హిల్స్ కో ప్రోగ్రాం వేస్తావనుకుంటే ఇలాంటి స్పాట్ ఎన్నుకున్నా వేమిటి?" అన్నాడు.

ఆమె సిగ్గుతో బరువెక్కిన కళ్ళను పైకెత్తి క్షణంలో సగంసేపు అతన్ని చూసి మళ్ళీ కళ్ళు వాల్చేసుకుంది.

"అక్కడి ప్రశాంతత నాకెంతో యిష్టం. మన మొదటిరాత్రి అక్కడే గడపాలని...." ఆపైన మాటలు పూర్తి చెయ్యలేకపోయింది. ఆమె ముఖం ఎర్రగా కంది పోయింది. పెళ్ళి బొట్టులో దేదీప్యమానంగా వెలిగి పోతోంది.

పర్ణశాల హైదరాబాద్‌కి నూట అరవై కిలోమీటర్ల దూరంలో వున్న ఓ కొండప్రదేశం. ప్రకృతి దృశ్యాలకు పెట్టింది పేరు. సెలవులు ఆనందంగా గడపటానికి, విహార యాత్రకు, సైట్ సీయింగ్‌కి సాధారణంగా పర్ణశాలకు పిక్నిక్ వేసుకుంటూరు.

వరసగా నాలుగు కొండలు ఒకదాన్ని ఆనుకొని మరొకటి వుంటాయి. వాటిలో చివరి కొండమీద పాడు బడిన కోట అవశేషాలు వున్నాయి. వాటి మధ్య ఓ పెద్ద రాతికట్టడం — పురాతన మైనది — వున్నది.

కొండలమీద, దిగువ కూడా ఎన్నో రకాల వృక్ష జాతులు, పూల మొక్కలు నయనానందకరంగా దర్శన మిస్తుంటాయి. పెద్ద పెద్ద గండశిలలు ఒకదానిమీద మరొకటి పేర్చినట్టుగా సహజంగానే ఏర్పడి వున్నాయి. అదొక మనోహర దృశ్యం!

పురాతన కట్టడానికి సమీపంలోనే ఓ పర్ణశాల వున్నది. ఆ కొండ ప్రాంతానికి అందుకే పర్ణశాల అనే పేరు వాడుకలోకి వచ్చింది.

పర్ణశాలలో ఒక పండు ముదుసలి నిత్యం ధ్యానంలో వుంటాడు. ఓ ఎత్తయిన రాతిబండమీద దర్భాసనం పరచుకుని అర్ధనిమీలిత నేత్రాలతో చేత జపమాల ధరించి, వెండిలా మెరుస్తున్న గడ్డంతో, జడలు కట్టిన కేశపాశాలతో అలనాటి మునీశ్వరుల్ని గుర్తుకు తెస్తుం టాడు.

ఆయనను అందరు బాబాజీ అని పిలుస్తారు. ఆయన ఎవరో ఎందుకు అక్కడ మౌనంగా తపస్సమాధిలో మునిగివుంటాడో యెవరికీ తెలియదు. ఆయనకి నూరేళ్ళ వయసుంటుందని కొందరు, కాదు నూట పాతికేళ్ళని

మరికొందరు నూటయేభై అని యింకొందరు — రక రకాలుగా చెప్పుకుంటారు. నిజం ఎవరికీ తెలియదు.

బాబాజీ పూర్తిగా మౌని కాదు. ఆయన రోజూ ఉదయం రెండుగంటలు కళ్ళు తెరిచి భవిష్యత్తు గురించి చెపుతాడు. ఆయన చెప్పినవి చాలావరకు నిజమవుతుంటా యని చెప్పుకుంటారు.

బాబాజీ చాలా అరుదుగా ఆహారం తీసుకుంటాడు. అది కూడా కేవలం కొన్ని పళ్ళు, పుట్టతేనె మాత్రమే! కొండల దిగువనున్న ఓ పల్లెనుంచి బాబాజీ సేవకోసం కొందరు పల్లెవాసులు నిత్యం పర్ణశాలవద్ద సిద్ధంగా వుంటారు. వాళ్ళకు ఆయన దేవుడు.

తక్కిన విషయాలకొస్తే, కొండమీద అధునాతన మైన కాటేజిల సముదాయమున్నది. దాదాపు నలభై కాటేజిలున్నాయి. దేనికదే విడివిడిగా వుండే ఆ కాటేజిల్లో అన్నిరకాల సదుపాయాలు వుంటాయి.

కాటేజికి రెండు గదులుంటాయి. చుట్టూ ఖాళీ స్థలంలో అందమైన క్రోటన్స్, పూలమొక్కలు వుంటాయి. ప్రతి కాటేజికి ఓవర్ హెడ్ టాంక్ వుంటుంది. ఇరవై నాలుగ్గంటలు నీటి సరఫరా వుంటుంది.

కొండ దిగువన ఓ పవర్ స్టేషన్ వున్నది. ఆ పవర్ స్టేషన్ ఆ చుట్టుపక్కల గ్రామాలకు విద్యుచ్ఛక్తి సర ఫరాకోసమని నిర్మించబడ్డది. పర్ణశాల కాటేజిలన్నిటికీ ఆ పవర్ స్టేషన్ నుంచే విద్యుత్తు సరఫరా అవుతుంది.

అంతేకాదు, కొండ దిగువనుంచి నీటిని నిరంతరం కొండపైనున్న కాటేజిలకి పంప్ చెయ్యటానికి ఓ పంప్ హౌస్ పవర్ స్టేషన్‌కి సమీపంలో నిర్మించబడి వున్నది.

నీరు, విద్యుచ్ఛక్తి సౌకర్యాలు పుష్కలంగా వుండటం వల్లనే పర్ణశాల గొప్ప యాత్రాస్థలంగా పేరుపొందింది. వచ్చిన యాత్రికులు రోజుల తరబడి ఏమాత్రం అసౌకర్యం లేకుండా కాటేజిల్లో గడిపి వెళ్ళటానికి ఎంతో అనువుగా వున్నది.

గతంలో వాసు వాళ్ళ ఆఫీసు బృందంతో పర్ణశాలకు వెళ్ళివున్నాడు. అప్పట్లో వాసుకి, శ్రీదేవికి పెద్దగా పరిచయం లేదు. మొదటిసారిగా పర్ణశాల దగ్గరే వాళ్ళకు మాటామాటా కలిసింది. సుందరప్రకృతి ఒడిలో ప్రేమకు తొలిపాఠాలు నేర్చుకున్నారు.

అందుకే శ్రీదేవి తమ ప్రథమ సమాగమానికి పర్ణశాలనే సరయిన సంకేత స్థలంగా నిర్ణయించు కున్నది.

వాసు ఆమెకంక నవ్వుతూ చూసి, "నీ కోరిక తీర్చటానికి నే నెప్పుడూ సంసిద్ధుడి నే! తప్పకుండా వెళ్దాం. ఓ వారం రోజులు సెలవు పెడదాం. సరిపోతుందా?" అన్నాడు.

శ్రీదేవి సిగ్గుతో నే తలూపింది.

3

పర్ణశాల చేరేసరికి సాయంత్రం అయిదు గంటలయ్యింది.

కొండ దిగువనుంచి మే నేజి మెంటువాళ్ళు పైకి ఎక్కడానికి కష్టపడనక్కర్లేకుండా బస్ సౌకర్యం కల్పించటం వల్ల యిట్టాయెకిన కొండమీదికి చేరిపోయారు బస్ లో.

బస్ కొండ ఎక్కుతుంటే ఆ మనోహర దృశ్యాన్ని చూసి శ్రీదేవి పులకించిపోయింది. చుట్టూ ఎటుచూసినా

అందమైన డిజైన్‌లా కనిపిస్తున్న చెట్లు, పూలమొక్కలు ఆనాసపండ్ల మొక్కలు, ఒకదానిమీద మరొకటి పేర్చినట్టు అమరిన బండరాళ్ళు మనోహర దృశ్యంలా వున్నాయి. చిత్రకారుడు యెంతో శ్రద్ధగా గీచిన చిత్తరువులా సజీవంగా కనిపిస్తూన్న పచ్చని ప్రకృతి!

"చూడండి, ఎంత అందమైన దృశ్యమో!" అన్నది పులకించిపోతూ వాసుతో.

వాసు ఆమె ఆనందంలో తనూ పాలుపంచుకుంటూ, "ఈ ప్రకృతి మధ్య పులకించిపోవాలని నీ కెందుకు కోరిక పుట్టిందో నా కర్థమయ్యింది. గుడ్ సెలక్షన్!" అన్నాడు.

ఆమె అతని భుజమ్మీద తలపెట్టి అలవోకగా అతని ముఖంలోకి పరవశంగా చూస్తోంది. అది యిద్దరు కూచునే సీటు!

బస్ ఎంతో జాగ్రత్తగా కొండలు ఎక్కుతోంది. రెండు కొండల్ని ఎక్కి మూడో కొండ ఎక్కబోతోంది. ఓ కొండనుంచి మరో కొండకి బస్ ఎక్కే దృశ్యం స్పష్టంగా కనిపిస్తోంది కిటికీలోనుంచి.

శ్రీదేవి చిన్నపిల్లలా కేరింతలు కొడుతూ వాసుకి చూపిస్తోంది. కొండ లోయలు కూడా భయంకరంగా అనిపించటంలేదు—అరి నీట్‌గా కనిపిస్తున్నాయి.

బస్ పర్ణశాల మేనేజ్‌మెంట్ ఆఫీసు ముందాగింది—

శ్రీదేవి చుట్టూ ఓసారి చూసి, "చాలవరకు తిరుమల హిల్స్‌లాగానే వుందికదూ యిక్కడ!?" అన్నది చుట్టూ కట్టబడిన కాటేజ్‌ల వంక చూస్తూ.

"అవును. తిరుమల కాటేజ్‌ల మాదిరిగానే కట్టారు యిక్కడి కాటేజ్‌లు కూడా. అయితే తిరుమలకొండలు

బాగా ఎత్తు. ఏడుకొండలు. ఇవి నాలుగు కొండలే. చెప్పుకోదగ్గ ఎత్తు లేవు. అయితే ఆ పురాతన కట్టడం మాత్రం విపరీతమైన ఎత్తులో వున్నది. కొండమీద మరో కొండ వేసారో ఎల్లుండో ఎక్కి చూద్దాం."

దూరంగా తెల్లగడ్డితో నేయబడ్డ పర్ణశాల కనిపిస్తోంది. దానిలోనే బాబాజీ వుంటున్నాడని వాసుకి తెలుసు. తమ ప్రోగ్రాంలో బాబాజీ దర్శనం కూడా వున్నది!

ఎంక్వయిరీ కమ్ రిజర్వేషన్ రూంలో వారంరోజులకి అద్దె ఎడ్వాన్స్ చెల్లించాడు వాసు. కావాలనే కొండ దిగువ దృశ్యాలు కనిపించే వీలున్న కాటేజ్ కావాలని ఎలాట్ చేయించాడు.

ఆ వరసలో అదే చివరి కాటేజ్. ప్రశాంతంగా, ప్రకృతి దృశ్యాలను కిటికీలోనుంచి అవలోకించటానికి అనువుగా వున్నది.

గదిని చూసి చాలా ముచ్చటపడింది శ్రీదేవి.

గతంలో తను ఆఫీసు స్టాఫ్‌తో వచ్చి వెంటనే సాయంత్రానికి వెళ్ళిపోయింది.

"చాలా చక్కగా వున్నదండీ కాటేజ్. లవ్‌లీ!" అన్నది శ్రీదేవి వాసు భుజాలమీద చేతులు వేసి—అతని కళ్ళల్లో కళ్ళు పెట్టి.

సరిగ్గా అప్పుడే కిటికీ దగ్గర ఏదో ఆకారం కనిపించిందామెకు—భర్త భుజాలమీది నుంచి.

ఆమె ఉలిక్కిపడి అతన్ని వదిలేసింది. ఆమె చర్యకు రవ్వంత ఆశ్చర్యంతో ఆమెవైపు చూసి ఆమె చూపులు కిటికీవైపు తిరిగి వుండటం చూసి, తనూ అటు చూశాడు.

అక్కడ అతని కొవరూ కనిపించలేదు!

"ఏమిటి దేవీ, అలా అయిపోయా వేమిటి?" అన్నాడు వాసు.

ఆమె కిటికీ దగ్గర ఎలాంటి దృశ్యం చూసిందో తెలియదుగాని, ఆమె శరీరం సన్నగా వణుకుతుండటం గమనించాడు వాసు.

ఆమె గబగబ కిటికీదగ్గరకు వెళ్ళి బయటకు చూసింది- అక్కడెవరూ లేరు!

కనుచీకటి పడుతోంది—అయినా దృశ్యాలు కనిపిస్తున్నాయి.

శ్రీదేవి తను చూసిన దృశ్యాన్ని మరచిపోలేక పోతోంది. ఎవరా మనిషి? ఎందుకంత ఆసక్తిగా తనవైపు చూస్తున్నాడు? ముఖం స్పష్టంగా కనిపించలేదు. తలమీది నుంచి గడ్డం కిందుగా మఫ్లర్ కట్టుకున్నాడు. తన ముఖం స్పష్టంగా గుర్తించకుండా జాగ్రత్తపడుతున్నట్టుగా, అనిపించింది తనకు.

అంటే....—అతను తెలిసినవాడేనా!?

ఆమె మస్తిష్కం చురుగ్గా పని చేస్తోంది.

తెలిసినవాడైతే ఆలా కిటికీలోనించి ఎందుకు తొంగి చూడటం? సరాసరి మెయిన్ గుమ్మం దగ్గర్నుంచే లోపలికి రావచ్చును కదా!

ఆమెకు అకస్మాత్తుగా గుర్తొచ్చింది. అవును, అతనే! ఇక్కడికెందుకు వచ్చినట్టు? అదీగాక, తనెంతో మనసు పడి వచ్చిన పన్నగాలకు అతను రావటం కేవలం కాకతాళీయమా? కావాలనే వచ్చివుంటాడు. తను చేసిన పరాభవం మర్చిపోలేడు. ప్రతీకారం తీర్చుకోవటానికి రాలేదు కదా!

ఆమె సన్నగా వణికింది. అతను చాలా దుర్మార్గుడు. నడిరోడ్డుమీద తన చెయ్యి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. అలాంటి పరిస్థితుల్లో పరువుగల ఆడపిల్ల యేం చేస్తుందో తనూ అదే చేసింది. చాచి లెంపకాయ కొట్టింది ఛెళ్ళున.

చుట్టూ జనం గుంపుగా గుమిగూడారు. అందరు తలో చెయ్యి వెయ్యబోయారు. కాని వాడు తెలివిగా తప్పించుకుని పారిపోయాడు ఆటోలో.

అతని ముఖం తనకి బాగా గుర్తు! ఫేషన్ కి పెంచుకుని నైస్ గా కత్తిరించుకున్న గడ్డం పదిమందిలో వున్నా అతన్ని గుర్తుపట్టేస్తుంది. మఫ్లర్ గడ్డంమీదుగా యెందుకు చుట్టుకున్నాడో తనకి అర్థమయ్యింది. గడ్డం కప్పివేసుకున్నా తనకి బాగా గుర్తున్నాయి.

శ్రీదేవి మౌనంగా వుండిపోయింది కొన్ని క్షణాల వరకు. ఆమె ఉత్సాహమంతా నీరుగారిపోయింది.

ఫస్ట్ నైట్, యీ ప్రకృతికాంత ఒడిలో పరవశించిపోతూ జరుపుకోవాలని ఎంతో సంబరపడింది. ఆదిలోనే హంసపాదులా యీ దుర్మార్గుడు దర్శనమిచ్చాడు. పైగా తన కాటేజ్ గుర్తించి, తొంగిచూసి మరీ వెళ్ళాడు. ఏం కుతంత్రం పన్నుతాడో....!?

వాసు శ్రీదేవిని పరిశీలనగా చూస్తున్నాడు. క్షణ క్షణానికీ ఆమెలో వస్తున్న మార్పుల్ని స్పష్టంగా గుర్తించాడు. ఆమె ఎందుకో మానసికంగా స్ట్రగులవుతోంది. ఆమె నంతగా కదలించివేసిన విషయమేమిటి? ఎందుకంత నెర్వస్ గా ఫీలవుతోంది? వాసుకి అసౌకర్యంగా అనిపించింది.

"ఏం కనిపించలేదు కదూ!? ఎందుకలా భయపడు

న్నావు?" అనడిగాడు వాసు.

"ఏం లేదు. ఎందుకో మనసు బావుండలేదండీ! కిటికీ దగ్గర యేదో చూసినట్టు భ్రమించాను, అంతే!" అన్నది తన మనోగతాభిప్రాయాన్ని బహిర్గతం చేయకుండా.

తను ఎందుకో విపరీతంగా ప్రవర్తిస్తున్నట్టు భర్త గుర్తించాడు. అతనికేమని సమాధానం చెపుతుంది? నిజం చెప్పి అతని మనసు పాడుచేసేకన్నా అబద్ధం చెప్పటమే మంచిది!

బాత్‌రూంలో వేడినీళ్ళ సౌకర్యం కూడా వున్నది. ప్రయాణ బడలిక తీరేవరకు గోరువెచ్చటి నీటితో స్నానం చేసింది. మనసు, తనువుకూడా ఎంతో తేలిగ్గా అనిపించాయి శ్రీదేవికి.

ఆకాశరంగు పాలియస్టర్ చీర, మేచింగ్ బ్లౌజ్ ఎంచుకొంది. మెడలో అంతక్రితం వరకు లాకెట్‌తో వున్న గొలుసు లాకెట్ స్థానంలో మంగళసూత్రాలను మోస్తూ ఠీవిగా ఆమె గుండెలమీద నాట్యం చేస్తోంది.

ఆమె చీర కట్టుకొంటుండగా కొంటెగా ఆమెవంక చూసి నవ్వాడు వాసు. ఆమె చిరుకోపం నటించి, "అటు తిరిగి నిల్చోండి మంచి బాలుడిలా" అంటూ సిగ్గుపడుతూనే చీర, బ్రా, జాకెట్ ధరించింది.

వాసు కాటేజ్ వరండాలోకి వచ్చి అటెండెంట్‌ని పిలిచాడు. అటెండెంట్ అప్పుడే ఎదుటి కాటేజ్‌లోనికి కారియర్ తీసుకువెళ్తూన్నాడు.

కారియర్ అప్పగించి వాసు దగ్గరగా వచ్చి "ఏం కావాలి సార్!?" అంటూ వినయంగా అడిగాడు.

"డబుల్ కారియర్. ప్యూర్ వెజిటేరియన్" చెప్పాడు వాసు. అతను వెళ్తుండగా వెనక్కు పిలిచి,

"అలాగే ఓ కిలో స్వీట్సు, రెండు డజన్ల చక్రకేళి అరటిపళ్ళు. సన్నజాజులు మల్లెలు గులాబీలు ప్యాక్ చేయించుకు రా!" అని చెప్పాడు.

భర్త ఆర్డరిస్తున్న వస్తువుల జాబితా వింటూ ముసి ముసిగా నవ్వుకొన్నది శ్రీదేవి. అసలు అతన్ని తనే దగ్గరుండి కొనిపించాలనుకొన్నది. కాని గడ్డంవ్యక్తి మూడ్ చెడగొట్టేశాడు. అటెండెంట్ ఏమనుకుంటాడో యీ లిస్టు విని?! ఆమెకు చాలా సిగ్గనిపించింది.

తలుపులు లోపల్నుండి మూసి బోల్టుపెట్టి శ్రీదేవి వంక చిలిపిగా చూశాడు వాసు.

శ్రీదేవి ముఖం ఎర్రగా కందిపోయింది. ఏదో టెన్షన్, ఉత్కంఠ నరనరాన పాకి ఆమెలో వింత ప్రకంపనాలు పుట్టించాయి.

వాసు ఆమెని సమీపించి ఆమె ముఖాన్ని అరచేతుల్లోకి తీసుకుని పెదాలను సున్నితంగా ముద్దు పెట్టుకున్నాడు.

శ్రీదేవి నిలువెల్లా పరవశంతో చిగురాకులా వణికింది. ఆమెకీ అనుభవం కొత్త. తమకంలో ఆర్తిగా భర్త ముఖంలోకి చూడటానికి సిగ్గుతెర అడ్డురాగా ఛాతీవంక మాత్రం కళ్ళెత్తి చూసి వాల్చేసుకున్నది.

కాలింగ్ బెల్ మోగింది.

ఇద్దరు ఉలిక్కిపడ్డారు. విడిపోయారు.

వాసు తలుపు తెరిచాడు—కారియర్ వచ్చి వుంటుందని.

కాని బయట ఎవరూ లేరు. మరి కాలింగ్ బజ్జర్ ఎవరు మోగించినట్టు?

శ్రీదేవి, వాసు ఆశ్చర్యంగా ఒకరి ముఖాలొకరు

చూసుకున్నారు. శ్రీదేవి మనసేదో కీడును శంకిస్తోంది. ఏదో జరగబోతోంది. ఏమిటది? తాము పర్ణశాలపై అడుగు పెట్టినప్పట్నుంచి వాతావరణం తమకు వ్యతిరేకంగా వుంది. ఈ రాత్రి కలాగో గడిపి ఉదయమే హైదరాబాద్ కు తిరిగి వెళ్ళిపోవాలి—అనుకొంది.

ఆమె దీర్ఘంగా నిట్టూర్చింది.

వాసు తలుపు మూసి బోల్టు పెడుతుండగా మళ్ళీ కాలింగ్ బజ్జర్ మోగింది.

శ్రీదేవి ఉలిక్కిపడింది—వాసులో ఆసక్తి పెరిగింది. మళ్ళీ తలుపు తెరిచాడు.

ఎదురుగా కేరియర్, అరటి ఆకులు పట్టుకుని అటెండెంటు నిల్చుని వున్నాడు!

4

"అరటిపళ్ళు పూలు తెస్తాను సార్! ముందు మీల్స్ తెచ్చాను. భోంచెయ్యండి!"

అంటూ వాటర్ జగ్ కడిగి నీళ్ళు నింపిపెట్టాడు. గ్లాసులు. జగ్ టీపాయ్ జరిపి దానిమీద పెట్టి కారియర్ టీపాయ్ పక్క పెట్టి వెళ్ళబోతుండగా వాసు వెనక్కి పిలిచి, ఏభై రూపాయల నోటందించాడతనికి—పళ్ళు, స్వీట్సుకోసమని.

అటెండెంట్ నోటందుకుని శాల్యూట్ చేసి వెళ్ళిపోయాడు.

శ్రీదేవి కేరియర్ విప్పి రెండు అరటి ఆకుల్లో అన్నం కూరలు వడ్డించింది.

భోజనం చాలా అద్భుతంగా వుంది. చాలా ఖరీదైన భోజనం! హైదరాబాద్ లో ఒకటి రెండు

హోటల్స్‌లో మాత్రమే, చాలా హెచ్చు బిల్‌తో దొరికే భోజన మది.

తృప్తిగా భోంచేశారిద్దరు. స్వీట్లు, అరటిపళ్ళు కూడా సప్లయ్ చేశారు భోజనంతో పాటు.

"చాలా దివ్యంగా వుంది" అన్నది శ్రీదేవి.

"అవును. బావుందని కడుపునిండా తినేశాం. నిద్ర కూరుకు వచ్చేస్తుందేమో! అసలే మెలకువగా వుండాల్సిన యీ రాత్రి...."

అతని మాటలు పూర్తికాకుండానే "ఛీ, పోండి!" అంటూ సిగ్గుతో మెలితిరిగిపోయింది శ్రీదేవి.

అయితే వాసు చెప్పిన మాటలు యేమాత్రం పొల్లు పోలేదు భోంచేసిన పది నిమిషాలకే ఆవలింతలు ప్రారంభ మయ్యాయి. ఎంత ఆపుకుందామన్నా ఆగకుండా నిద్ర కళ్ళమీదకు కూరుకువచ్చేసింది.

శ్రీదేవికైతే మరీను. ఎంతగానో కంట్రోల్ చేసు కోవాలని విశ్వప్రయత్నం చేసింది. ఏదో మాట్లాడ బోయింది. మాటలు తడబడ్డాయి. వాసు కూడా కళ్ళు బలవంతాన విప్పటానికి వ్యర్థ ప్రయత్నం చేశాడు.

మరుక్షణం యిద్దరు బెడ్‌మీద అడ్డంపడి నిద్ర పోసాగారు.

కాలింగ్ బెల్ అదేపనిగా మోగుతోంది. కాని వాళ్ళిద్దరిలో యెవరూ లేవలేదు. బెల్ మోత ఎక్కడో నిద్రలో రైలింజను కూతలా, సైరన్‌లా రకరకాలుగా వాళ్ళకి భ్రాంతిని కలిగించింది. అదీ నిద్రలోనే. మెల కువ రాలేదెంతకూ.

అర్థరాత్రి దాటాక అకస్మాత్తుగా మెలకువ వచ్చింది వాసుకి. పక్కమీద శ్రీదేవి గాఢంగా నిద్రపోతోంది.

తొలగిన ఆమె చీర వక్షస్థలాన్ని బహిర్గతం చేస్తోంది. అమాయకంగా నిద్రిస్తూన్న ఆమె వదనంపై ముంగురులు ఫేన్ గాలికి నాట్యం చేస్తూన్నాయి.

సరిగ్గా అప్పుడే కాలింగ్ బజర్ మోగింది.

ఇంత రాత్రప్పుడు ఎవరు వచ్చారో, ఏం పనిపడి వచ్చారో అని కొద్ది క్షణాలవరకు అయోమయంగా అనిపించింది. ఆ తర్వాత ఆ సాయంత్రం జరిగిన సంఘటనలు ఒకటొకటే గుర్తొచ్చాయి.

భోజనం చేసిన వెంటనే తామిద్దరు మొద్దు నిద్ర పోయారు. అటెండెంట్ ని పూలు పళ్ళు తెమ్మని ఏభై నోటిచ్చాడు తను! ఆ అటెండెంట్ యేమైపోయాడు? ఇప్పుడు బెల్ కొడుతున్నదెవరు? అటెండెంట్ అవన్నీ పట్టుకొచ్చాడా?

అసలు తమ ఫస్టునైట్ జరగాల్సిన సమయంలో తామిద్దరు మొద్దునిద్ర పోవడమేమిటి?

లోలోపలే నవ్వుకున్నాడు వాసు.

తలుపులు తెరవటానికి గుమ్మంవైపు వెళ్తుండగా అకస్మాత్తుగా కరెంటు ఫెయిలయ్యింది. ఒక్కసారిగా గదంతా చిమ్మచీకటి అలుముకున్నది.

ఒక్క క్షణం సంశయించాడు వాసు, తలుపులు తెరవాలా వద్దా అని! సరిగ్గా అప్పుడే దేంతోనో తలుపుల మీద కొట్టడం వినిపించింది గట్టిగా కాదు, సుతారంగా తడుతున్నారెవరో!

వాసు బోల్టు తెరిచి, తలుపులు తెరిచాడు.

అంతే!

ఒక్కసారిగా అతన్ని ఎవరో చుట్టుముట్టి పెడరెక్కలు

విరిచి పట్టుకున్నారు. ఇంకొకరు అరవకుండా నోరు నొక్కేశారు. మరొకరు కదలకుండా కాళ్ళు చేతులు—గింజుకుంటున్నా వదలకుండా—పట్టి బంధించేశారు.

వాసు ఊహించని యీ పరిణామానికి నిశ్చేష్టుడై పోయి వాళ్ళ చేతుల్లో బందీగా చిక్కిపోయాడు.

అతడా క్షణంలో ఆలోచిస్తున్నది తన గురించి కాదు. అమాయకురాలు, నిస్సహాయురాలునైన శ్రీదేవి గురించి!

ఆమెకు ఎలాంటి ఆపద రాకూడదని భగవంతుణ్ని మనసారా స్మరించుకున్నాడు. అతని మొర ఆ భగవంతుడు ఆలకించాడా అన్నట్టు ఎదురుగా వున్న కాటేజిలోనించి ఎవరో యిద్దరు వ్యక్తులు పరుగెత్తుకుంటూ వచ్చారు.

అప్పటికే వాసుని బయట నిలబెట్టిన చిన్న కారులోకి ఎక్కించారు దుండగులు. తర్వాత శ్రీదేవి కోసం యిద్దరు దుండగులు మళ్ళీ కాటేజి మెట్లెక్కుతుండగా ఎదుటి కాటేజి వ్యక్తులు పరుగెత్తుకొచ్చారు.

వెంటనే ఆ యిద్దరు దుండగులు తమ ప్రయత్నం విరమించుకుని కారెక్కి కూచున్నారు. మరుక్షణం కారు మెరుపులా దూసుకుపోయి మాయమయ్యింది.

ఎదుటి కాటేజి వ్యక్తులు శ్రీదేవి నిద్రపోతుండటం చూశారు. వాళ్ళిద్దర్లోను ఒకాయన చేతిలో టార్చ్ లైటుంది. ఆయన ముసలివాడు. ఆయనతో వున్న రెండో వ్యక్తి దాదాపు ఏభై యేళ్ళ వాడు. ఇద్దరు కరెంటు ఫెయిలవ్వటంతో ఫేన్స్ లేక చల్లగాలికోసం తలుపులు తెరుచుకుని కాటేజి వరండాలోకి వచ్చారు. సరిగ్గా అప్పుడే దుండగులు వాసుని ఎత్తుకుపోయే ప్రయత్నంలో వున్నారు.

శ్రీదేవిని లేపటానికి ప్రయత్నిస్తుండగా లైట్లు వెలిగాయి__కరెంటు వచ్చింది.

వాళ్ళిద్దరూ తలుపుమీద తట్టినా, 'అమ్మాయి!' అంటూ గట్టిగా పిలిచినా శ్రీదేవి నిద్ర లేవలేదు. ఇద్దరు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

ముసలాయన లోపలి కడుగుపెట్టి శ్రీదేవిని తట్టి లేపాడు.

అయిదు నిముషాల ప్రయత్నం తర్వాత శ్రీదేవి దిగ్గున మేల్కొన్నది. లేచి పక్కమీద కూచుంది.

"ఎవరు మీరు....? ఎవరు కావాలి....?" అంటూ అరిచింది.

ముసలాయన ఆమెవంక జాలిగా చూసి, "అమ్మాయీ నువ్వు ధైర్యంగా వుండు. నీతో బాటు వుండిన యువకు డెవరు?....నీ భర్తేనా?..."

అవునన్నది శ్రీదేవి నిద్రమత్తునించి తేరుకుంటూ. చుట్టూ కలియచూసింది. వాసు లేడు. ఎక్కడికి వెళ్లాడు? అనుకున్నది. ఇంకా మగతగానే వుంది.

ముసలాయన చెప్పాడు: "నీ భర్తనెవరో దుర్మార్గులు ఎత్తుకుపోయారు."

కెవ్వుమన్న కేక ఆమె పెదాలు దాటి బయటకు రాలేదు.

శ్రీదేవి మూర్ఛపోయింది షాక్‌తో.

5

మరునాడు ఉదయం వరకు శ్రీదేవి తేరుకోలేదు.

ఈ లోపల ఎదురుగా వున్న కాటేజ్‌లో దిగిన ముసల్లాయన, ఆయన ఏభైయేళ్ళ డాక్టరు కొడుకు ఇద్దరు శ్రీదేవి మంచం దగ్గరే కూచుని సపర్యలు చేశారు.

ముసలాయన పేరు సర్వోత్తమరావు. డాక్టరు పేరు నరోత్తమరావు. ఇద్దరు హైద్రాబాద్ నించి వచ్చారు. ముసలాయన యేదో గవర్నమెంటు ఉద్యోగం చేసి పది పన్నెండుయేళ్ళ క్రితమే రిటైరయిపోయాడు. డెబ్బైఏళ్ళు మీదపడ్డా చెక్కుచెదరకుండా ఉక్కుముక్కలా వున్నాడాయన. కొడుకు కన్న ఆరోగ్యవంతంగా వున్నాడు. ఆయనకు డాక్టరు ఒక్కడే సంతానం.

సర్వోత్తమరావు పర్ణశాలకి తీసుకువెళ్ళమని నరోత్తమరావుని కొన్నాళ్ళుగా అడుగుతున్నాడు. ఇన్నాళ్ళ తర్వాత తండ్రి కోరికని మన్నించి పర్ణశాలకు తీసుకు వచ్చాడు నరోత్తమరావు. వాళ్ళు ఆ క్రితంరోజే ఆ ఎదుటి కాటేజిలో దిగారు. తండ్రికి ఎప్పుడు యే మవసరం వస్తుందోనని తన మెడికల్ చెస్టుతోనే తిరుగుతుంటాడు డాక్టర్. ఆ అలవాటు శ్రీదేవి ప్రాణం కాపాడటానికుపయోగపడింది.

శ్రీదేవి భారంగా కళ్ళు తెరిచి తన ముఖంలోకి ఆత్రుతగా చూస్తూన్న తండ్రీ కొడుకుల్ని చూసింది. ఆమెకు రాత్రి జరిగిన సంఘటన వెంటనే గుర్తొచ్చి చటుక్కున లేచి కూచుని, "ఏరీ, వారేరీ?" అంటూ హిస్టీరికల్‌గా అడిగింది.

నరోత్తమరావు ఆమెను శాంతపరుస్తూ "ప్లీజ్, ఎగ్జయిట్ కావద్దు. మీ వారు యింకా రాలేదు. ఆయన గురించి వర్రీ కావద్దు" అన్నాడు.

"ఆయన్నెవరో ఎత్తుకుపోయారని మీరే కదా చెప్పారు? మళ్ళీ వర్రీ కావద్దంటారేం? చెప్పండి, ఆయన్నెవరు ఎత్తుకుపోయారు? ఎక్కడకు తీసుకుపోయారు?" ఏడ్చేస్తోంది శ్రీదేవి.

సర్వోత్తమరావు ఆమె మంచం దగ్గరగా కుర్చీ లాక్కుని, "అమ్మా, నీ తండ్రిలాంటివాడ్ని చెప్తున్నాను. నీ భర్త క్షేమంగా వుంటాడు. ఆతన్నెవరో కిట్టనివాళ్ళు కావాలని తీసుకపోయి ఆటలాడుతున్నారు. ఈ పాటికి వదిలేస్తారు. వాళ్ళు మీ కాటేజీలో ప్రవేశించి ఏదైనా దొంగిలించాలని వచ్చివుంటారు. మీ ఆయన అందు కవకాశ మివ్వకపోగా ఆయన్ని కార్లో బంధించి పడేసి వాళ్ళ పని కానిచ్చుకోవాలనుకుని వుంటారు. ఇంతలో మమ్మల్ని చూసి పారిపోయారు. మీ వారీ పాటికి వస్తూంటారు" చెప్పాడు అనునయంగా.

శ్రీదేవి తల అడ్డంగా తిప్పి, "వాళ్ళు దొంగలు కాక పోవచ్చు— మా మీద కక్షపట్టిన వాళ్ళెవరో అయి వుంటారు—ఆయన్ని అంత తేలిగ్గా వదలరేమో!" అన్నది దుఃఖంతో పూడుకుపోయిన కంఠంతో.

ఆమె కళ్ళు అప్రయత్నంగా కిటికీవైపు తిరిగాయి.

వాసుని యెవరెత్తుకపోయారు? యిది గడ్డం వ్యక్తి పనేనా? తనమీద కక్ష సాధిస్తున్నాడా అతను? దుష్టుడికి దూరంగా వుండాలన్నారు. తను వాడితో కావా అని తగవుపడలేదు.

'భగవాన్, ఆయనకే ఆపదా రాకుండా కాపాడు తండ్రీ! నా మూలంగా ఆయన ప్రాణ ప్రమాదంలో చిక్కుకున్నారు. నా ప్రాణం పోయినా ఫర్వాలేదు. ఆయన మాత్రం క్షేమంగా వుంటే అంతే చాలు!' మనసులో యెందరో దేవుళ్ళకు పేరు పేరునా మొక్కుకున్నది శ్రీదేవి.

సర్వోత్తమరావు ఫ్లాస్కునించి గ్లాసులోకి కాఫీ వంచి, "ఇది తీసుకో తల్లీ! కాస్త నీరసం తగ్గుతుంది!"

అన్నాడు.

శ్రీదేవి తల అడ్డంగా తిప్పి, "ఆయన నా కళ్ళబడే వరకు వచ్చి మంచినీళ్ళు కూడా ముట్టను" అన్నది ఆమె కంఠంలో తొణికిన స్థిరత్వానికి, గంభీరతకు తండ్రీకొడుకు లిద్దరు క్షణం నివ్వెరపోయారు.

"చూడమ్మా. అత నెలాగూ కాసేపట్లో యిక్కడికే వస్తాడు. నువ్వు ఏం తీసుకోకుండా భీష్మించుక్కూచుంటే ఆరోగ్యం పాడవుతుంది. మెంటల్ గా ఫిజికల్ గా బాగా డిప్రెస్ అయి వున్నావు. బి ఛీర్ ఫుల్. మనసు ప్రశాంతంగా వుంచుకో!" సర్వోత్తమరావు నచ్చచెప్ప బోయాడు.

"ప్లీజ్, నన్ను బలవంతం చెయ్యొద్దు. మీకు నాపట్ల దయ వుడితే వారెక్కడున్నారో కాస్త వెతికించండి. ఆయన్ని చూడకపోతే నేను బతకను. రేపు సూర్యోదయం చూడను" శ్రీదేవి కళ్ళు నీటితో నిండిపోయాయి.

సర్వోత్తమరావు ఆమె తల నిమిరి, "ఆ ప్రయత్నాలు జరుగుతున్నాయి తల్లీ! ఇంత క్రితమే పర్ణశాల మేనేజ్ మెంట్ వారికి సంగతి వివరిస్తూ కంప్లయింట్ ఇచ్చాను. తమ పర్ణశాల చరిత్రలోనే యిలాంటి సంఘటన యిప్పటిదాకా యెదురుకాలేదని వాళ్ళు ఆశ్చర్యపోతున్నారు. ఇదే మొదటిసారిట. తమకు చెడ్డపేరు రాకుండా చూసుకోవలసిన బాధ్యత తమదేనని, ఎలాగైనా వెతికి అప్పగిస్తామనీ చెప్పారు. మేము నిన్ను కనిపెట్టుకుని యిక్కడే వున్నాం. ఇప్పుడు మళ్ళీ ఎంక్వయిరీ ఆఫీసుకి వెళ్ళి వివరాలు కనుక్కుని వస్తాను" అన్నాడు.

శ్రీదేవి చేతులెత్తి యిద్దరికీ నమస్కారం చేసింది. "ముక్కూ మొహం ఎరగని నా పట్ల మీరు చూపిస్తున్న

దయ, అభిమానం నా జన్మలో మరచిపోలేను. నాకు దేవుడిచ్చిన తండ్రిగా, అన్నయ్యగా మిమ్మల్ని జీవితాంతం గుర్తు పెట్టుకుంటాను" అన్నది.

సర్వోత్తమరావు ఆమె చేతులు మృదువుగా నొక్కి వదిలి, "అది మా బాధ్యతగా భావిస్తున్నాం అమ్మా! ఇందులో కృతజ్ఞతలు ఋణాల ప్రసక్తి లేదు. నువ్వు నిశ్చింతగా వుండు. ఆతన్ని వెతికి నీకు అప్పగించే పూచీ మాది!" అన్నాడు వాత్సల్యంగా.

శ్రీదేవి కంట నీరు తిరిగింది. తన కన్నతండ్రి కర్కశంగా తన కిష్టమైన పెళ్ళిని అంగీకరించకుండా మొహం చాటేస్తే, ఏ సంబంధంలేని మనిషి కన్నతండ్రిలా తనని సాకుతున్నాడు. ఏనాటి ఋణానుబంధమో యిది!?

"నువ్వు పదే పదే కంట తడిపెట్టకమ్మా! నేను ఎంక్వయిరీ ఆఫీస్‌కి వెళ్ళి కనుక్కొని వస్తాను. బాబూ, నువ్వు అమ్మాయిని కనిపెట్టుకొని వుండు" అంటూ సర్వోత్తమరావు చకచక వెళ్ళిపోయాడు. ఆ వయసులో కూడా అంత చురుగ్గా అడుగులు వేస్తూ పని చేస్తూన్న ఆ వృద్ధుడ్ని ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయింది శ్రీదేవి.

సర్వోత్తమరావు ఆమెవంక చూసి, "చూడమ్మా! ఈ టాబ్లెట్‌ను పరగడుపున వేసుకోకూడదు. ఇందు గురించయినా నువ్వు యేదోక ఆహారం తీసుకోకతప్పదు" అన్నాడు.

శ్రీదేవి బలహీనంగా నవ్వి "పోనీ. ఆ కాఫీయే తాగుతాను లెండి. కాని యిలా కాదు, మొహం కడుక్కొని వచ్చి...." అంటూ లేచి నాలుగడుగులు వెయ్యబోయి తూలిపోబోయి అంతలోనే సర్దుకుంది.

బాత్‌రూంలోకి వెళ్తూ అప్రయత్నంగా కిటికీ వైపు

చూసి తృప్తిపడింది. కిటికీ బయట గడ్డం వ్యక్తితో బాటు మరో వ్యక్తి కనిపించాడామెకు.

అతను సంజీవి! తన మేనబావ!!

శ్రీదేవి అదిరిపడి చూసింది. సంజీవి యిక్కడికెప్పు డొచ్చాడు? తనీ కాటేజ్‌లో వుందని ఎలా తెలిసింది? గడ్డం వ్యక్తికీ, సంజీవికి యేమిటి సంబంధం? వాసు కిడ్నాపింగ్‌లో సంజీవికి కూడా భాగముందా? తనపై అందరు యేక కాలంలో కక్షగట్టి ప్రతీకారం తీర్చుకుం టున్నారా?

'భగవాన్ నేనే పాపం చేశాను!? ఆయున్ని కాపాడు!' అనుకొంటూ బాత్‌రూంలోకి నడిచింది. ఆమె ఒక్కసారిగా పది లంఖణాలు చేసిన దానిలా కుంగిపోయింది.

6

పదకొండు గంటల ప్రాంతంలో సర్వోత్తమరావు తిరిగివచ్చాడు. ఆయన ముఖంలో అలసట, నడకలో నీరసం ఆవరించుకున్నాయి.

ఆయన నోటితో చెప్పకుండానే గ్రహించింది శ్రీదేవి. వాసు జాడ తెలియలేదు.

"మీరు వెళ్ళి విశ్రాంతి తీసుకోండి పెదనాన్నగారూ! నా అదృష్ట మెలావుంటే అలాగే జరుగుతుంది" అన్నది శ్రీదేవి.

మరో అరగంట కూచుని తండ్రీ కొడుకు లిద్దరు తమ కాటేజికి వెళ్ళిపోయారు.

వెళ్ళే ముందు సర్వోత్తమరావు మరీ మరీ చెప్పాడు. "పన్నెండు గంటలకి కేరియర్ పంపించమని అటెం డెంట్‌కి చెప్పివచ్చానమ్మా! స్నానం చేసి భోజనం

చెయ్యి— టెంపరేచర్ తగ్గింది. మరేం ఫరవాలేదు!"
అని.

శ్రీదేవి మౌనంగా తలూపింది.

వాళ్ళు అలా వెళ్ళగానే యేదో నిర్ణయాని కొచ్చిన దానిలా లేచి చకచక దుస్తులు మార్చుకున్నది. తన వెంట తెచ్చుకున్న గాడ్రెజ్ తాళంకప్ప గుమ్మానికి లాక్ చేసి, బయటకొచ్చింది.

ఆమె లక్ష్యం ఒక్కటే! తనకొచ్చిన విపత్తు నుంచి గట్టున పడెయ్యగల వ్యక్తి ఒక్కడే!

అతను పర్ణశాలలో తపస్సు చేసుకుంటున్న బాబాజీ! ఆయన తప్పకుండా వాసు జాడ చెప్పగలడు. అదే ఆమె ధైర్యం!

సరాసరి రెల్లుగడ్డి పర్ణశాలను చేరుకున్నది.

మధ్యలో, దారిలో గడ్డం వ్యక్తి గాని, సంజీవి గాని కనిపిస్తారేమోనని ఆమె గుండె పీచుపీచుమంటూనే వుంది.

కాని వాళ్ళిద్దరి జాడలేదు!

పర్ణశాల దగ్గర పల్లెజనం కొందరు బాబాజీ సేవ కోసం ఎదురుచూస్తూ నిల్చున్నారు.

బాబాజీని కల్సుకోవాలన్నట్టుగా లోపలకు కబురు పెట్టింది శ్రీదేవి.

అయిదు నిమిషాల్లోనే ఆమెకు పిలుపొచ్చింది.

పన్నెండు గంటల్లోపలే బాబాజీ యెవరికయినా సమాధానాలు చెపుతారు. ఆ తర్వాత మళ్ళీ ధ్యానంలో మునిగిపోతారు— ఆ విషయం శ్రీదేవికి తెలియదు. కాని అనుకోకుండా పన్నెండు గంటల లోపలే అక్కడికి రావటం తన అదృష్టంగా భావించుకున్నది.

అప్పుడు మధ్యాహ్నం పదకొండు ముప్పయి అయిదు నిమిషాలయింది!

శ్రీదేవి లోపలికి నడిచింది.

లోపల ఓ బండరాతిమీద పరచిన దర్భాసనం మీద ఆసీనులై వున్న పండు ముదుసలి కనిపించాడామెకు. అతన్ని చూడగానే యెంతటివాళ్ళకయినా గౌరవభావం కలుగుతుంది.

అంత క్రితమే యెవరో యిద్దరు భక్తులకి వాళ్ళ సమస్యలకు పరిష్కారం సూచించి మళ్ళీ ధ్యానంలో ఉన్నారని అక్కడివాళ్ళు శ్రీదేవికి చెప్పారు.

రోజుకి ముగ్గురికి మాత్రమే బాబూజీ సమాధానాలు చెప్తారట. ఇది కూడా అక్కడి అనుచర బృందంలోని వాళ్ళు చెప్పారామెకు. ఆ లెక్కన శ్రీదేవి మూడో భక్తురాలు.

కొన్ని క్షణాల తర్వాత బాబూజీ కళ్ళు తెరిచి యెదురుగా వినమ్రంగా నిల్చున్న శ్రీదేవిని చూసి ఆదరంగా నవ్వారు.

శ్రీదేవి ఆయనకు నమస్కరించి "స్వామీజీ నా భర్త గతరాత్రి నుంచి కనిపించటంలేదు. మా కాలేజి నుంచి యెవరో దుండగులు వారి నెత్తుకుపోయారు. దయచేసి వారి జాడ తెలిపి నన్ను రక్షించండి!" అన్నది వినయంగా.

బాబూజీ వదనం గంభీరముద్ర దాల్చింది. కొద్దిసేపు మౌనంగా ధ్యానంలోకి వెళ్ళిపోయారు.

అయిదు నిమిషాల తర్వాత ఆయన కళ్ళు తెరిచి శ్రీదేవివంక దయగా చూసి "నీ భర్త వాసు క్షేమంగా వున్నారు. అయితే అతను నలుగురు శత్రువుల మధ్య

బందీగా వున్నాడు" అన్నాడు.

శ్రీదేవి ముఖంలోకి కొండంత వెలుగు వచ్చింది. "ధన్యురాల్ని స్వామీ! ఆయ నెక్కడున్నారు?"

బాబూజీ కొద్ది సేపటివరకు మాట్లాడలేదు. "కొండ దిగువన చిట్టడివి వున్నది. ఆ చిట్టడివిలో ఓ బంగళా వున్నది. అది పూర్వకాలం రాజులెవరో కట్టించారు. ప్రస్తుతం శిథిలావసలో వున్నది. అందులో నీ భర్తను బంధించారు తల్లీ!" అన్నాడు బాబూజీ.

మరుక్షణం బాబూజీకి పాదాభివందనం చేసి ఒక్క ఉదుటున బయటికొచ్చింది శ్రీదేవి.

పర్ణశాలని ఆనుకొని ఏటవాలు కొండ, కొండలమధ్య లోయ, లోయకి ఎడమపక్కగా పవర్ స్టేషను, కుడి పక్కగా పంపింగ్ హౌస్ కనిపించాయి శ్రీదేవికి.

పరీక్షగా ముందుకి—కొండ దిగువకు దృష్టిని సారించింది. ఒత్తుగా పెరిగిన పొదలతో చెట్లతో చిట్టడివి కనిపించించింది. చెట్ల మధ్యగా దూరంగా ఏదో పురాతన కట్టడం కనిపించింది.

బాబూజీ చెప్పిన శిథిలబంగళా అదే అయివుంటుంది. చూడటానికి దగ్గరగానే కనిపించినా దాన్ని చేరటానికి ఎంత కాదన్నా రెండు మూడు గంటలు పడుతుంది.

ముందు బస్‌లో ప్రయాణం చేసి కొండ దిగువకు వెళ్ళాలి. ఆ తర్వాత చిట్టడివిలో ప్రవేశించి, ఆ పురాతన భవనాన్ని చేరాలి!

శ్రీదేవిలో తెగింపు ధైర్యం, చొరవ చోటు చేసుకున్నాయి. వెంటనే బస్‌స్టాప్ దగ్గరకు నడిచింది. వచ్చేటప్పుడు హేండ్ బాగ్ తెచ్చుకోవటం మరచిపోలేదు. అందులో అవసరానికి సరిపడే డబ్బుంది.

ఆ హడావిడిలో సర్వోత్తమరావు గాని నరోత్తమ రావుగాని ఆమెకు గుర్తురాలేదు.

7

బస్‌లో కొండదిగువకు ప్రయాణం సాగించింది శ్రీదేవి. కొండెక్కేటపుడు మనసును ఆహ్లాదపరచిన ప్రకృతి దృశ్యాలు యిప్పుడామె మనసు కెక్కడంలేదు. చిరాగ్గా, ఆందోళనగా వుంది. టెన్షన్‌తో మెదడు నరాలు చిట్లి పోతాయేమో నన్నట్టుగా వుంది.

ఓ అరగంట పైగానే పట్టింది కొండ దిగటం.

కొండ దిగుతూనే బస్ నుంచి కిందికి దుమికి పవర్ స్టేషన్ వైపు చకచక సాగిపోయింది శ్రీదేవి. కొండ మీది నుంచి చూసినపుడు ఎంతో దగ్గర అనిపించిన పవర్ స్టేషన్ ఓ గంటవరకు చేరుకోలేకపోయింది.

ఓ పక్క కడుపులో ఆకలి దహించివేస్తోంది. పదకొండు గంటల ప్రాంతంలో మందుబిళ్ళ వేసుకోవటం కోసం తాగిన కాఫీ తప్ప మరే ఆధరవూ లేదు కడుపులో. అయినా ఆమె లెక్క చేయలేదు. ఓ పక్క నిస్త్రాణగా నీరసంగా వున్నా—వడి వడిగా అడుగులు వేస్తూనే వుంది.

ఒకే లక్ష్యంతో ఒకే గమ్యంతో ముందుకు దూసుకు పోతోంది శ్రీదేవి. యెలాగైనా భర్తను శత్రువుల బారి నుంచి రక్షించుకోవాలి! ఆయన్ని రక్షించే ప్రయత్నంలో తన ప్రాణం పోయినా సరే! తను లెక్క చేయదు.

ఆమె మరో గంటలో శిథిలబంగళా దగ్గర కొచ్చేసింది.

అది చాలా పెద్ద బంగళా—విశాలమైన గదులు, ఎత్తయిన స్తంభాలు దూరానికి ఓ పెద్ద కోటలాగా

భ్రమ కలిగిస్తున్నాయి.

సరాసరి లోనికి చొచ్చుకొనిపోయింది.

దారిలో ఆమె కెవరూ ఎదురుకాలేదు. ఎవరూ అడ్డగించ లేదు.

ముందు విశాలమైన హాలు కనిపించింది. పెద్ద ముందువా ఆగి, దానికి చేర్చి వరసగా పెద్ద పెద్ద గదులున్నాయి. వాటి తలుపులు చాలవరకు చెదలు తినేసి శిథిలావస్థలో వున్నా గత వైభవ చిహ్నాలు చెక్కుచెదరకుండా నిలిచి వున్నాయి.

ఈ గదుల్లో యెందులోనో తన భర్తను బంధించి వుండొచ్చు....అన్ని గదులూ వెదుకుతూపోతే....!?

అప్పటికే ఆమె బాగా అలసిపోయింది.

ఒక్క క్షణం ఆగి అలుపు తీర్చుకోవాలనుకున్నది. మరుగ్గా వున్న ఓ గది గోడ నానుకుని నిల్చున్నది.

పక్కనే గుప్పున ఖరీదయిన అల్కహాలు వాసన ముక్కుపుటాల్ని అదరగొట్టింది.

చటుక్కున తల తిప్పి చూసిన శ్రీదేవి నిశ్చేష్టురాలై నిల్చుండిపోయింది.

అక్కడ నలుగురు గూండాలాంటి వ్యక్తులు కూచుని సీసాలకి సీసాలు మద్యం గడగడ తాగేస్తున్నారు___ సిగరెట్లు కాల్చుతూ, మాంసం నంజుకొంటూ కేరింతలు కొడుతున్నారు.

అయితే వాళ్ళెవరూ శ్రీదేవిని గమనించలేదు.

గమనించలేదని ఆమె భ్రమపడింది. కాని కోరలు చాచుకుని తన మీదకు లంఘించటానికి ఓ నరరూప రాక్షసుడు కాచుకుని వున్నాడని ఆమెకు తెలియదు.

"వచ్చావా, నీ కోసమే చూస్తున్నాను!" అన్న

మాటలు వినిపించి చటుక్కున అటు తలతిప్పి నిర్ఘాంత పోయింది శ్రీదేవి.

8

"బాబూజీ, మీరా? ఇక్కడ?" అన్నది శ్రీదేవి తన కళ్ళను తనే నమ్మలేకపోతూ.

పర్ణశాలలోని మాని బాబూజీ- ఆమె కెదురుగా నిల్చుని చిరునవ్వు నవ్వుతున్నాడు.

బాబూజీ నవ్వుతూ ఆమెను సమీపించాడు. "నీ భర్తను రక్షించుకోవాలని పాపం యింతదూరం వచ్చావు కదూ! నీ కెలాంటి ప్రమాదం ఎదురుకాకూడదని నిన్ననుసరిస్తూ నే నొచ్చాను. నీ భర్తను చూస్తావా?" అడిగాడు నవ్వుతూ.

శ్రీదేవి ధర్మసంకటంలో వూగిసలాడుతోంది. పర్ణశాలలో తపస్సు చేసుకునే బాబూజీ తనని యీ శిథిల భవనానికి వెళ్ళమని సూచించిన బాబూజీ, తనకన్న ముందుగా నే యిక్కడి కెలా చేరుకున్నాడు? పైగా తనకి సహాయం చెయ్యాలని తనకి తోడుగా రావటమా? అసంభవం! ఇందులో యేదో మోసముంది.

"రా, అలా నిల్చుండిపోయావేం? నీ భర్త వాసుని శత్రువుల బారినుంచి తప్పించాలని వచ్చావు కదా! ఇంకా ఆలోచిస్తూ సమయాన్ని వ్యర్థం చేస్తావెందుకు?" బాబూజీ ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

విషసర్పం తనని తాకినట్టు విల విల్లాడింది శ్రీదేవి. అతని చెయ్యిని విదిల్చికొట్టి, "మీరు .... నువ్వు బాబూజీవి కాదు!" అన్నది!

బాబూజీ వికటంగా నవ్వి "నువ్వు చాలా తెలివైనదానివి. ఎస్, యు ఆర్ రైట్! నేను బాబూజీ కాని

బాబూజీని! అయితే నీకు సలహా చెప్పిన బాబూజీ నే! పర్ణశాలలో నీకు కనిపించిన బాబూజీ నే!

తపస్సు చేసుకుంటూ ముక్కు మూసుకుని పర్ణశాలలో సంవత్సరాల తరబడి భక్తుల మన్ననలందుకున్న బాబూజీ ఎప్పుడో స్వర్గలోకాన్ని వెతుక్కుంటూ పోయాడు. దాదాపు ఆర్నెల్లయింది. అప్పట్నుంచీ నేనే బాబూజీని" అంటూ తెల్లగా వెండిలా మెరుస్తూన్న గడ్డాన్ని, మీసాల్ని, తెల్లజుట్టును లాగిపారేశాడు.

బాబూజీ స్థానంలో ఇరువయ్యేళ్ళ యువకుడు నిల్చుని వున్నాడు. కర్కశంగా నవ్వుతున్నాడు. అతని కళ్ళలో ఎరుపుజీరలు అతను బాగా తాగివున్నాడని చెప్పక నే చెప్తున్నాయి. కాంతితో, తమకంతో శ్రీదేవిని సమీపించి మళ్ళీ చెయ్యి అందుకున్నాడు.

"నన్ను విడిచిపెట్టు. మా వారినెక్కడ దాచావో చెప్పు! నీ మాట నమ్మి తెలివితక్కువగా యిక్కడకు వచ్చి చాలా పొరపాటు చేశాను. నన్ను, నా భర్తను వదిలెయ్యి....ప్లీజ్!" రెండు చేతులు జోడించింది శ్రీదేవి.

"పిచ్చిదానా, నీ భర్త యిక్కడెందుకుంటాడు? కొండమీదే వున్నాడు. ముప్పయిమూడో కాటేజిలో భద్రంగా వున్నాడు. నిన్నిక్కడికి రప్పించటం కోసమని నీ భర్త యిక్కడున్నాడని కల్పించి చెప్పాను.

నిన్న సాయంత్రం నువ్వు నీ భర్తతో బస్ దిగినప్పుడే నా మనుషులు నీ అందం గురించి నీ పర్సనాల్టీ గురించి నాకు వెంటనే కబురు చేశారు. నేను, నా ఫ్రెండ్సు అర్నెల్లుగా యీ పర్ణశాల కొండకొచ్చే సుందరాంగుల సౌందర్యాన్ని ఉమ్మడిగా అనుభవించాం. వాళ్ళ భర్తల్ని

బంధించి అనక వదిలేశాం. అమ్మాయిల్ని కూడా మా అవసరాలు తీరాక వదిలేసేవాళ్ళం.

కాని, బాబూజీయే యివన్నీ చేస్తూన్నట్టు యెవరికీ తెలియకుండా ఆర్నెల్లుగా గడుపుకొస్తున్నాం. ఈ రోజు కూడా నా నిజరూపం నీకు తెలియకుండా పోయేది. గాని, నేనే కొంచెం తొందరపడ్డాను.

నిన్న ఆక్సిడెంట్ తెచ్చిన కారియర్లో కావాలనే మత్తుమందు కలిపించాం. మీ రిద్దరు మత్తులో మునిగి వుండగా నిన్నెత్తుకొచ్చేయాలనుకున్నాం. కాని నీ మొగుడు లోపల్నుంచి తలుపు బోల్టు పెట్టుకోవటంవల్ల తలుపులు తెరవటం ఆలస్యమయ్యింది మాకు. నీ మొగుడు తలుపులు తెరిచేవరకు ఆగవలసి వచ్చింది.

అప్పుడు కూడా, నిన్ను తీసుకొచ్చేలోపల మీ ఎదుటి కాటేజి ముసలాళ్ళు అడ్డొచ్చి మా పనికి ఆటంకం కలిగించారు. లేకుంటే పోయిన రాత్రే ముప్పయిమూడో నెంబరు కాటేజి పులకించిపోయి వుండేది నీ శృంగారంతో ...." అతను ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తున్నాడు.

శ్రీదేవి భయంతో కంపించిపోతూ ఒక్కొక్క అడుగు వెనక్కి వేస్తోంది. బాబూజీగా పరిచయమైన అ వ్యక్తి చటుక్కున ముందుకు జరిగి ఆమెను తన బాహువుల్లో బంధించాడు.

శ్రీదేవి ఎగిరి అతని గుండెలమీద తన్నింది. అతను ఊహించని యీ దాడికి ఓ క్షణం తడబడి మళ్ళీ ఆమె మీదికి లంఘించబోయాడు. శ్రీదేవి ఈసారి అతని కాళ్ళ మధ్య సున్నిత ప్రదేశంలో తన్నింది.

అతను విలవిల్లాడుతూ నేలమీదకు విరుచుకు పడి

పోయాడు.

శ్రీదేవి ఒక్క ఉదుటన్న బయటకు పరుగెత్తింది. ఆ వ్యక్తి కేకలు పెడుతున్నాడు. అంతవరకు బ్రాందీ మత్తులో తూలుతున్న అతని అనుచరులు నలుగురూ ఒక్కసారిగా మత్తునుంచి బయటపడి శ్రీదేవిని వెంబడించారు.

శ్రీదేవి పదడుగులు పరుగెత్తి గడ్డిదుబ్బు తగిలి బోర్లా పడిపోయింది. మోచేతులు, మోకాళ్ళు చెక్కుకు పోయాయి.

సరిగ్గా అప్పుడే అనుచరులు నలుగురు ఆమెను సమీపించారు.

వాళ్ళు నలుగురు ఆమెమీదికి లంఘించే సమయంలో ఊహించని విధంగా సంజీవి, గడ్డంవ్యక్తి వాళ్ళ నలుగురు మీద వెనుక నుండి దాడి చేశారు.

వాళ్ళెక్కడ్నుంచి వూడిపడ్డారో తాగుబోతులు ఊహించేలోపల వాళ్ళ నలుగుర్ని పొడవాటి కట్టె పుల్లలతో నెత్తిమీద బలంగా మోదారు సంజీవి, గడ్డం వ్యక్తి.

అసలే బాగా తాగివున్న ఆ నలుగురికీ తలలు దిమ్మెక్కి వూపిరాడలేదు. జేబుల్లో దాచుకున్న కత్తుల్ని పైకి తెచ్చేలోపల మళ్ళీ సంజీవి, గడ్డం వ్యక్తి వాళ్ళని వూపిరి తిరక్కుండా కట్టెలతో మోది, నేల కరిపించారు.

కిందపడ్డ శ్రీదేవి అప్పటికి సర్దుకుని లేచి నిల్చుంది.

సరిగ్గా అప్పుడే బాబూజీ వేషం ధరించిన ఆ వ్యక్తి అక్కడ ప్రత్యక్షమయ్యాడు. అతని చేతిలోని రివాల్వర్

సూటిగా శ్రీదేవికి గురిచేసి వున్నది!

"మీరేదైనా గడుబుపని చెయ్యాలని ప్రయత్నిస్తే యీమెను నిర్దాక్షిణ్యంగా కాల్చేస్తాను. కట్టెపుల్లలు నేల మీద పడేసి చేతులెత్తి ఆమె పక్కనే నిల్చోండి" అని ఆజ్ఞాపించాడా వ్యక్తి.

సంజీవి, గద్ద వ్యక్తి ఒకరి ముఖాలొకరు చూసుకుని కట్టెపుల్లలు నేలమీద పడేసి శ్రీదేవి పక్కగా వచ్చి నించున్నారు.

9

"రెడీ. వన్....టూ....మీ యిష్టదైవాన్ని తల్చుకోండి! ఈ రజనీమీద తిరగబడ్డవాళ్ళెవరూ బతికి బట్టకట్టలేరు. నా రహస్యాలు తెలిసిన మిమ్మల్ని ప్రాణాలతో వదలను....త్రీ...." అనబోయాడు బాబూజీగా పరిచయమైన రజనీ.

అంతే! ఆ మరుక్షణం అతని చేతిలోని రివాల్వర్ ఎగిరి దూరంగా పడింది. రక్తం కారుతున్న చేతిని ఎడమ చేత్తో అదిమి పట్టుకుని అదిరిపడి చూశాడు రజనీ!

ఎదురుగా పొగలు కక్కుతున్న రివాల్వర్‌తో నరోత్తమరావు నిల్చుని వున్నాడు.

"వాళ్ళు కాదు, నువ్వు తల్చుకో నీ ఇష్టదైవాన్ని!" అంటూ శ్రీదేవివైపు తిరిగి, "నువ్వు యీ యిద్దరితో కాటేజ్‌కి వెళ్ళమ్మా! నాన్నగారు ఎదురుచూస్తున్నారు. నీ భర్త వాసు జాడ తెలిసింది. ముప్ఫయిమూడో కాటేజీలో బంధింపబడి వున్నట్టు మేనేజ్‌మెంట్ వాళ్ళు కనిపెట్టి, యింతక్రితమే అతన్ని మీరు బసచేసిన కాటేజ్‌కి అప్పగించారు. మీ నాన్న పుల్లారావు కూడా వచ్చాడు. ప్రస్తుతం అల్లుడితోనే వున్నాడు పరామర్శిస్తూ...."

అన్నాడు.

రజనీ గుర్రుగా చూశాడు.

"మీ రిక్కడికెలా వచ్చారు? నే నిక్కడున్నట్టు మీ కెలా తెలుసు?" అడిగింది శ్రీదేవి. ఓ పక్క భర్త క్షేమంగా వున్నాడన్న వార్త, మరోపక్క తండ్రి తమను వెతుక్కుంటూ పర్ణశాలకు వచ్చాడన్న శుభ వార్త, ఆమె మనసును ఆనందంతో ముంచెత్తేశాయి.

"నువ్వు ఫోం చేశావో, లేదో చూడటానికి వచ్చిన నాకు గుమ్మానికి వేలాడుతున్న తాళంకప్ప కనిపించింది. ఏమైపోయావోనని తర్జన భర్జనల్లో వున్న మా యిద్దరికీ ఎంక్వయిరీ ఆఫీస్ నించి కబురొచ్చింది వాసు దొరికాడని! వెంటనే ఆ కాలేజ్ కి వెళ్ళి వాసుని వెంటబెట్టుకుని మీ కాలేజ్ కొచ్చాం.

అప్పుడే మీ నాన్న మీ కాలేజ్ కొచ్చాడు. వాడు నేను యింటర్ వరకు క్లాస్ మేట్స్. పుల్లారావు కూతురు వని గతరాత్రే నేను గుర్తించాను. నీ భర్త నెవరో ఎత్తుకు పోవటం చూశాంకదా, కంప్లెయింట్ యివ్వటానికి పేరు కోసం చూశాం. టేబిల్ మీద నీ డైరీ కనిపించింది. అందులో మీ గురించిన వివరా లున్నాయి.

అప్పుడే తెలిసింది నువ్వు పుల్లారావు కూతురని! మీ భార్యాభర్తలు మా కెంతో సన్నిహితులని, మీ రక్షణ భారం మా మీద వేసుకున్నాం. తర్వాత మీ నాన్నకు ఫోన్ కూడా చేశాము.

మే మందరం నీ గురించి వెతుక్కోవటం మొద లెట్టాం.... వాసు లేవలేని స్థితిలో వున్నాడు. నే నే అతన్ని రావద్దని చెప్పి ఆపు చేశాను.

ఇంతలో సంజీవి, యీయన స్నేహితుడైన యీ సలీం

నన్ను కల్సుకున్నారు. సంజీవి ఉదయం నేను నీకు ట్రీట్ చేస్తూండగా చూశాడట. అంచేత నన్ను వెంటనే గుర్తుపట్టి, నువ్వు కొండదిగుతున బస్‌లో వెళ్తున్నావని ఒంటరిగా వెళ్తున్నావని వెంటనే నిన్ను కల్సుకోవటానికి వెళ్ళాలని చెప్పాడు.

నేను వీళ్ళిద్దర్ని ముందు పంపించి, రివాల్వర్ కోసం నా కాలేజ్‌కి తిరిగొచ్చాను. నువ్వేదో ప్రమాదంలో చిక్కుకున్నావని ముందుగా తెలీదు. అయినా ముందు జాగ్రత్తకోసమని రివాల్వర్ వెంట తెచ్చుకోవటం యిలా ఉపయోగపడింది" అంటూ ముగించాడు నరోత్తమ రావు.

ఈ లోపల సంజీవి, గడ్డంవ్యక్తి సలీం, కిందపడిన నలుగుర్నీ, రజనీని కట్టకలిపి ఓ నైలాన్ తాడుతో కట్టేశారు. ఆ తాడును శిథిల భవనంలో వెతికి తెచ్చాడు సలీం.

శ్రీదేవి సలీంవంక, సంజీవివంక అయోమయంగా చూసింది.

సంజీవి గొంతు సవరించుకుని, "శ్రీదేవీ! నీ పెళ్ళి వాసుతో జరిగిపోయిందని తెలిశాక నా మనసు మార్చుకున్నాను. మామయ్యను కూడా పట్టుదలకు పోవద్దని, నిన్ను వదులుకోవద్దని నచ్చచెప్పాను—ఆయన నన్ను నీ కోసం వాసు యింటికి పంపాడు. నిన్న ఉదయం మీరు పర్ణశాలకు హనీమూన్‌కి వెళ్ళారని వాసు యింట్లో చెప్పారు. మామయ్య నన్ను వెంటనే మీ దగ్గరకు వెళ్ళి యింటికి తీసుకురమ్మని పంపాడు.

నిన్న పర్ణశాలకు వచ్చే బస్‌లు దాటిపోవటంతో ఈ రోజు ఉదయమే బయల్దేరి వచ్చాను. రాగానే పర్ణశాల

కొండమీద సలీం కనిపించాడు. సలీం నా స్నేహితుడు. నువ్వు నా మేనమామ కూతురువని వీడికి తెలియదు. వీడిని ఓ సారి అవమానించావని అందుకని నీ మీద కక్ష తీర్చుకోబోతున్నానని చెప్పాడు. అయితే నువ్వు నాకేమవుతావో చెప్పాక, తన అభిప్రాయాన్ని వెంటనే మార్చుకున్నాడు. నీకు క్షమాపణ చెప్పుకుంటానని చెప్పాడు.

ఇద్దరం మీ కాలేజ్ కి వచ్చాం. కాని తలుపు తాళం పెట్టివున్నది. నిన్ను ముందు చూసిన వెంటనే కాలేజ్ కి వచ్చివుంటే నువ్వు యీ ప్రమాదంలో చిక్కుకొని వుండకపోయేదానివి! మేమిద్దరం తర్జన భర్జనల్లో కొంత టైం వేస్టు చేశాం. ఇంతలో నువ్వు తాళం పెట్టి వెళ్ళిపోయావు.

నిన్ను వెతుక్కుంటూ వచ్చాం. బస్ కిటికీవైపు కూచున్న నిన్ను చూశాం. అప్పటికే బస్ కొండదిగి పోతున్నది.

ఇంతలో డాక్టర్ నరోత్తరావుగారు కనిపించారు. నువ్వు ఒక్కదానివీ వెళ్ళిపోతున్నావని చెప్పాం. ఏదయినా అఘాయిత్యం చేస్తావని డాక్టరుగారు భయపడ్డారు. వాసు కనపడటం లేదన్న విషయం అప్పుడే తెలిసింది మాకు.

వెంటనే మేమిద్దరం టాక్సీ కుదుర్చుకుని కొండదిగువకొచ్చాం. డాక్టరుగారు కాలేజ్ కి వెళ్ళొస్తామని వెళ్ళిపోయారు. కొండ దిగేసరికే నువ్వు చిట్టడవిలోకి వెళ్ళిపోవటం జరిగింది. మేము నిన్ను వెంబడించాం. ఇదీ జరిగిన సంగతి!" అని ముగించాడు.

సలీం శ్రీదేవిని సమీపించి, "నన్ను క్షమించండి! మీ

మీద పగ తీర్చుకోవాలనుకున్నాను. మీరు నా ఫ్రెండు బంధువని తెలిశాక నా అభిప్రాయం మార్చుకున్నాను. మీరు నా చెల్లెలుతో సమానం!" అన్నాడు.

శ్రీదేవి నవ్వుతూ అతనివంక చూసి, "నిన్న రాత్రి నుంచి ఉదయంవరకు నన్ను వెంటాడి హడలగొట్టేశారు కదూ!" అన్నది. తర్వాత సంజీవివంక తిరిగి, "నిన్నపార్థం చేసుకున్నాను బావా! ఉదయం కిటికీలో నుంచి నిన్ను, సలీంగార్ని చూశాను. మీ ఇద్దరు నా మీద పగబట్టారని భ్రమ పడ్డాను. నా ప్రాణాలు రక్షిస్తారని కల్లో కూడా అనుకోలేదు" అన్నది.

సంజీవి మందహాసం చేసి, "నిన్ను చూసిన వెంటనే నిన్ను కల్సుకోకుండా మేమిద్దరం కేంటిన్ కి వెళ్ళటం పొరపాటయింది. నీమీది దురభిప్రాయాన్ని పోగొట్టాలనే వీడ్ని కేంటిన్ కి తీసుకువెళ్ళి బోధ చేశాను. ఇద్దరం నీ కాలేజ్ కి తిరిగొచ్చేసరికి నువ్వు పారిపోతావని కలగంటామా?" అన్నాడు.

నరోత్తమరావు "పదండి, పదండి! వీళ్ళను సగౌరవంగా పర్ణశాల మేనేజ్ మెంట్ కి అప్పగించాలి! మీ ఇద్దరు ముందు పవర్ హౌస్ దగ్గర్నుంచి పర్ణశాల ఎంక్వైరీ ఆఫీస్ కి ఫోన్ చేసి పోలీసులని పంపించమని చెప్పండి! నేను వీళ్ళను కాపాలా కాస్తూంటాను. నువ్వు వీళ్ళతో వెళ్ళమ్మా!" అన్నాడు శ్రీదేవిని చూసి.

—: అ యి పో యిం ది :—